సాక్షి
ఏలూరు
బుధవారం ◆ 20 ◆ మార్చి ◆ 2024



ఆటోలు ఢీ.. ఆరుగురికి గాయాలు

జంగారెడ్డిగూడెంలో రెండు ఆటోలు ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి.

8లో ▸



రోగులకు ఆర్థిక ఆసరా

వైఎస్ జగన్ ప్రభుత్వం అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పేదలకు పింఛన్లు ఇచ్చి వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడుతోంది.

8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహరి గురువారం (ఉదయం)
ఏలూరు	6.22	4.45
భీమవరం	6.21	4.49

న్యూస్‌రీల్

ఎన్నికల తాయిలాల రవాణాను అరికడదాం



సమావేశమైన ఆంధ్ర, తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీస్ అధికారులు

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టులు బలోపేతం చేసుకుని నగదు, మద్యం, సారా, ఎన్నికల తాయిలాల రవాణాను నిరోధించడానికి ఇరు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలని కల్లూరు ఏసీపీ రఘు విజ్ఞప్తి చేశారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాలులో మంగళవారం ఆంధ్ర, తెలంగాణ అంతర్‌రాష్ట్ర సరిహద్దు పోలీస్ మీటింగ్‌ను జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇరు రాష్ట్రాల పోలీసులు, ఎన్నికల సిబ్బంది పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగడానికి సహకరించుకోవాలని తీర్మానించారు. సమావేశంలో పోలవరం డీఎస్పీ ఎస్ సురేష్‌కుమార్‌రెడ్డి, నూజివీడు డీఎస్పీ జి లక్ష్మయ్య, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, చింతలపూడి సీఐ ఎం.సుధాకర్, జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, అశ్వరావుపేట సీఐ కె.జితేంద్ర, సత్తుపల్లి సీఐ ఎన్.వెంకటేశ్వర్రావు, ఇరు రాష్ట్రాల బోర్డర్ నియోజకవర్గాల ఎస్సైలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 23,875 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం హిందీ పరీక్షకు మొత్తం 24,209 మంది రెగ్యులర్ విద్యార్థులకు 23,452 మంది హాజరయ్యారు. 757 మంది గైర్హాజరయ్యారు. ఒకసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు 1342 మందికి 423 మంది హాజరు కాగా 919 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 96.87గా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 42 పరీక్షా కేంద్రాలను, జిల్లా పరిశీలకులు ఒక పరీక్షా కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

రబీలో సాగునీటికి ఇబ్బంది లేదు

ఏలూరు(మెట్రో): గోదావరి డెల్టా పరిధిలో రబీ సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేదని గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉందని చెప్పారు. సాగు, తాగునీటికి ఇబ్బంది ఏర్పడితే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ధవళేశ్వరం ఫోన్ నెం. 9490741146, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్, ఏలూరు ఫోన్ నెంబర్ 9701375830, చీఫ్ ఇంజినీర్ ఫోన్ నెంబర్ 9652536333లో సంప్రదించాలన్నారు.

దూరవిద్య ఇంటర్ పరీక్షలకు 680 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సుకు సంబంధించి పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 302 మందికి 278 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. వాణిజ్య శాస్త్రం పరీక్షకు 443 మందికి 402 మంది హాజరుకాగా 41 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలకులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఒక హైపవర్ కమిటీ, డీఈసీ కమిటీ సభ్యులు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

క్షీరారామలింగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ. 13,37,985లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి వర్దినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను తెలిచారు. అనంతరం లెక్కించగా నగదుతో పాటు 23.350 గ్రాముల బంగారం, 2.80 కేజీల వెండి వచ్చిందన్నారు. అలాగే వివిధ దేశాల కరెన్సీ 10 నోట్లు వచ్చినట్లు తెలిపారు. 90 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈలెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కూటమి మొండిచేయి

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఒక్క సీటూ కేటాయించని టీడీపీ, జనసేన, బీజేపీ
- మాజీ మంత్రి పీతల, మాజీ ఎంపీ తోటకి భంగపాటు
- అధికార వైఎస్సార్‌సీపీలో మూడు స్థానాల కేటాయింపు
- నర్సాపురం లోక్‌సభకు ఉమాబాల, గోపాలపురం, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థులుగా వనిత, రాజ్యలక్ష్మి
- కూటమి తీరుపై మహిళల్లో తీవ్ర అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీట్ల కేటాయింపుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మహిళలకు మొండిచేయి చూపింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు ఉంటే కనీసం ఒక్క టికెట్ కూడా కేటాయించపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ కేటాయింపు చూస్తుంటే ఆ పార్టీల్లో మహిళలకు ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందని, మహిళా సాధికారతకు ఇస్తున్న విలువేంటో తెలుస్తుందని ఆ పార్టీల మహిళా నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార వైఎస్సార్‌సీపీ ఈసారి ముగ్గురు మహిళలకు అవకాశం కల్పించింది.

మాటలే తప్ప సీట్లు లేవు

మహిళలు తమ పార్టీకి వెన్నుముక అని పదే పదే చెప్పే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు.. ఆ పార్టీలో పలువురు మహిళా నాయకులు ఉన్నా వారందరినీ పక్కనపెట్టారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వీర మహిళలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప చేతల్లో మాత్రం వారికి ఎలాంటి గౌరవం ఇవ్వడం లేదని నిరూపించుకున్నారు. జిల్లాలో పశ్చిమగోదావరి టీడీపీ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి భీమవరంలో క్రియాశీలకంగా ఉంటూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. టికెట్ ఆశతో గత మూడున్నరేళ్ల నియోజకవర్గంలో పనిచేశారు. ఏడాది క్రితమే టికెట్ లేదని తేల్చి చెప్పడంతో చేసేదేమి లేక మౌనంగా ఉండిపోయారు. మాజీ మంత్రి పీతల సుజాతను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. పెత్తందారుల పార్టీ కొందరి మాటలు నమ్మి తనను రాజకీయంగా సమాధి చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని మూడు రిజర్వ్ స్థానాలు టీడీపీ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించింది. ఒక్కటైనా మాల సామాజిక వర్గానికి ఇస్తే తనకు అవకాశం దక్కుతుందని సుజాత ఎదురుచూసి భంగపడ్డారు. బీజేపీలో ఉంగుటూరు టికెట్ ఆశించి శరణాల మాలతీరాణి, జనసేన దెందులూరు టికెట్ ఆశించి ఘంటసాల వెంకటలక్ష్మిలు తమను పరిగణనలోకి తీసుకోకపోవడంతో చేసేదేమి లేక మౌనంగా ఉండిపోయారు.

వైఎస్సార్‌సీపీలో మూడు స్థానాలు



గూడూరి ఉమబాల, నర్సాపురం ఎంపీ అభ్యర్థి



తానేటి వనిత, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి



తెల్లం రాజ్యలక్ష్మి, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి

అధికార వైఎస్సార్‌సీపీలో మహిళలకు ఈ సారి అగ్రపీఠం దక్కింది. పార్టీ ఆవిర్భావం అనంతరం మొదటిసారిగా జిల్లాలో మూడు స్థానాలు మహిళలకు కేటాయించారు. నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బీసీ శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన గుడూరి ఉమబాలను ఖరారు చేశారు. ఆమెకు రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ పార్లమెంట్ సీటు వస్తుందని ఎవరూ ఊహించలేదు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుండటం, సామాజిక సమీకరణాల దృష్ట్యా ఉమబాలకు అవకాశం దక్కింది. గోపాలపురం నియోజకవర్గం నుంచి హోం మంత్రి తానేటి వనితకు అవకాశం దక్కింది. గతంలో వనిత ఇక్కడి నుంచి అసెంబ్లీకి గెలుపొందారు. పోలవరంలో మొదటి సారి మహిళకు అవకాశం దక్కింది. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.

జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు

పశ్చిమలో ప్రతిసారి మహిళా అభ్యర్థులు గెలుపొందుతూనే ఉన్నారు. 2004లో ఆచంట నుంచి పీతల సుజాత, గోపాలపురం నుంచి మద్దాల సునీత గెలుపొందగా, 2009లో గోపాలపురం నుంచి తానేటి వనిత, పాలకొల్లు నుంచి బందారు ఉషారాణి గెలుపొందారు. 2014లో చింతలపూడి నుంచి సుజాత, 2019లో కొవ్వూరు నుంచి వనిత గెలుపొందారు. తానేటి వనిత, పీతల సుజాత మంత్రులుగా పనిచేశారు.

ఎన్నికల నియమావళి అమలుపై సమీక్ష

ఏలూరు(మెట్రో): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జేసీ బి.లావణ్య వేణితో కలిసి ఎన్నికల అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ ఎక్కడా ఉల్లంఘనలకు తావులేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. సీ విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి తీసుకున్న చర్యలను నివేదించాలన్నారు. ఫిర్యాదులను నియోజకవర్గ స్థాయిలోనే పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో ఏలూరు జిల్లాలో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన 8 చెక్‌పోస్టుల్లో 3 షిఫ్టుల ద్వారా సిబ్బంది పర్యవేక్షిస్తారని అన్నారు. దీనికి సంబంధించి సీసీ కెమేరాలు చెక్ పోస్టులలో అమర్చి టెలికాస్ట్ ద్వారా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూంకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయ భవనాలు, ప్రభుత్వ అండర్ టేకింగ్ భవనాలు, ప్రైవేటు భవనాలపై ఎలాంటి రాజకీయ పార్టీల హోర్డింగ్స్, పోస్టర్లు ఏర్పాటు చేయకూడదని ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశాలిచ్చారు. ఎన్నికల విధులకు కేటాయించిన పోలింగ్ అధికారుల శిక్షణా తరగతుల నిర్వహణపై సమావేశంలో కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్‌ఓ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలుచేయాలి



రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తదితరులు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు సంబంధించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దని ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్‌ఓ డి.పుష్పమణి, ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేశామని, నోటిఫికేషన్ విడుదల లోపే పీఓలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

సిలిండర్లకు అదనంగా వసూలు చేస్తే చర్యలు

ఏలూరు(మెట్రో): వంటగ్యాస్ సిలిండర్లు పంపిణీలో అదనంగా వసూలుచేసే గ్యాస్ కంపెనీ డీలర్లపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం వంట గ్యాస్ పంపిణీపై జిల్లాలోని గ్యాస్ కంపెనీ ఏజెంట్లతో కలిసి జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్లు సక్రమంగా పంపిణీ చేయాలని, 15 కిలోమీటర్ల లోపు వరకు ఎలాంటి చార్జీలు వసూలు చేయరాదన్నారు. కొందరు గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సిలెండర్ బరువులో కూడా ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వినియోగదారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సిలెండర్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఆర్.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కడదాం

మతంగూడెంలో విజయరాజు ఎన్నికల ప్రచారం

లింగపాలెం: జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ఓటర్లను కోరారు. లింగపాలెం మండల మతంగూడెం గ్రామంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ మోహనరెడ్డిని సీఎంను చేసేందుకు అందరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయంతో గెలిపించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలంటూ గ్రామంలో ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల నుంచి ఆయనకు అపూర్వ స్పందన లభించింది. మహిళలు విజయ రాజుకు అడుగడుగున హారతులు పట్టారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓట్లు వేయాలని కోరారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి తన పాలనలో అందించిన సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారుడికి సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అలాంటి నాయకుడిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు తదితరులు పాల్గొన్నారు.



లింగపాలెం మండలం మతంగూడెంలో ఇంటింట ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న విజయరాజు

పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా

ఈసీ మార్గదర్శకాలపై కేబుల్ ఆపరేటర్లకు అవగాహన



మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయాలని కేబుల్ ఆపరేటర్లకు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ప్రసార మాధ్యమాలు, కేబుల్ ఆపరేటర్లు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రసార మాధ్యమాలు అనుసరించాల్సిన విధి విధానాలపై భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన తాజా మార్గదర్శకాలు, కోర్టులు జారీ చేసిన ఆదేశాల మేరకు వ్యవహరించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థుల ప్రకటనలు పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమించామన్నారు.

అనుమతి పొందాకే ప్రసారం

అభ్యర్థులకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) అనుమతి పొందిన రాజకీయ ప్రకటనలను మాత్రమే ప్రసారం చేయాలన్నారు. ప్రింట్ మీడియాలో పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రచురించే ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ప్రకటనల్లో కుల, మత, భాషాపరమైన, అంశాలు ఉండకూడదని, ఇతరులను కించపరిచే అంశాలు, విద్వేషాలను రగిల్చే అంశాలు ఉండకూడదన్నారు. ప్రసార అంశాలను ప్రసార తేదీకి మూడు రోజులు ముందుగా ఎంసీఎంసీకి అనుమతి నిమిత్తం అందజేయాలన్నారు. ఏ తేదీలలో ప్రసారం చేస్తారో తెలియచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేస్తే సంబంధిత కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభ అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అమమతి ఉందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో చేసే ప్రచార ఖర్చులను అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో చేర్చేందుకు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ఎంసీఎంసీ వివరాలు సమర్పిస్తుందన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎంసీఎంసీ సభ్యులు కె.బాబ్జి, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులంతా సమైక్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ

ఏలూరు (టూటౌన్): ఉద్యోగులంతా సమైక్యంగా పనిచేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పటిష్టానికి కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గొంతి ఆస్కరరావు పిలుపు నిచ్చారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని డాక్టర్స్ బిల్డింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సూర్యనారాయణ, ఆస్కరరావులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండి వారి సమస్యలన్నింటినీ పరిశీలించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. సంఘం పటిష్టతకు తగు సూచనలు, సలహాలు తీసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు.

గెలుపే పరమావధిగా పనిచేయాలి



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు

ఏలూరు (టూటౌన్): వచ్చే ఎన్నికల్లో గెలుపే పరమావధిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు స్టార్ క్యాంపెయినర్‌లుగా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్‌లో కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆళ్ల నాని పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అన్నీ ఏకమై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. జగన్‌ను గద్దె దింపాలనే ఆలోచనతో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై బరిలో నిలుస్తున్నాయని గుర్తు చేశారు. అడవికి రాజు సింహం అని రాష్ట్ర రాజకీయాల్లో సింహం లాంటి వైఎస్ జగన్ ఒంటరిగానే వస్తున్నారని, గుంపులుగా వచ్చే నక్కల మాదిరిగా టీడీపీ కూటమి వస్తుందన్నారు. తోడేళ్లు ఏకమై వచ్చినా సింహం జూలు కూడా కదల్చలేవన్నారు. మళ్ళీ సీఎంగా వైఎస్ జగన్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దీనికోసం కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, క్లస్టర్ 3 ప్రెసిడెంట్ మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు : ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పెద్ద సంఖ్యలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలో జాయిన్ అయ్యారు. స్థానిక కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ ఆధ్వర్యంలో 50 మంది జనసేన కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆళ్ల నాని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

సంక్షేమం, అభివృద్ధికి ఓటేద్దాం

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



తిమ్మన్నగూడెంలో మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం రాత్రి చల్లచింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెంలో «నేను సిద్ధం– మా ఊరు సిద్ధం» కార్యక్రమం సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, సీతంపేట సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), వైఎస్సార్‌సీపీ నాయకులు నాగనబోయిన సునీల్, కంచర్ల సురేష్, పంచకర్ల వీర్రాజు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.4 కోట్లతో నవరత్నాల పథకాలతో పాటు అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మిగిలిన అన్ని పార్టీలు ఏకమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని చూస్తున్నారని, సీఎం జగన్‌కు అండగా నిలబడాలని కోరారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, ఆ వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని అడుగుతారని వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో తొలగించిన ఘనుడు చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో 50 వేల మెజారిటీ తమ లక్ష్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల నుంచి ఇంతవరకు చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం ప్రజల ఆదర అభిమానాన్ని ఎన్నటికి మరువలేమన్నారు. 2024– అబ్బయ్యచౌదరి వన్స్ మోర్ అంటూ గ్రామస్తులతో కలిసి నినాదాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అమలు చేస్తున్న పథకాల అభివృద్ధిని గుర్తించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు తదితరులు మాట్లాడారు. అనంతరం అబ్బయ్యచౌదరి రోడ్‌షో నిర్వహించారు. గ్రామ సర్పంచులు పరసా లక్ష్మి సుజాత కనకరాజు, మెండెం సంతోష్‌కుమార్, యలమర్తి రేవతి రామకృష్ణ, నాయకులు రామకృష్ణ, చిరంజీవి, బ్రహ్మాజీ, ఎంపీటీసీ యలమర్తి బాపూజీ, మరీదు రాజా, గొరిపర్తి రంగారావు, పరసా గణేష్, ఇతర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, మహిళల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

క్లుప్తంగా

సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న కె.అద్దయ్య

చింతలపూడి: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆంధ్ర, తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య లింగగూడెం, అల్లిపల్లి చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి వచ్చే వాహనాలను సిబ్బంది చేస్తున్న తనిఖీలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీల్లో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం, నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనకూడదని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ, ఎస్సై కుటుంబరావు ఉన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆగిరిపల్లి: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లికి చెందిన అంజలికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన ప్రత్తిపాటి రుదమ్‌కు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.ఒక లక్ష కట్నం ఇచ్చినట్లు అంజలి ఫిర్యాదులో తెలిపింది. పెళ్లి తరువాత కొన్ని రోజులు అత్తింటివారు బాగానే చూసుకున్నారని, తర్వాత భర్త రుదమ్, అతని కుటుంబ సభ్యులు అదనంగా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్త, కుటుంబ సభ్యులపై ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ శకం

పింఛనే నా జీవితానికి ఆధారం



నా భర్త ఇటీవల మరణించాడు. ఇప్పుడు నా వయస్సు 54 సంవత్సరాలు. మండవల్లిలో నివాసం ఉంటున్నాను. నాకు బిడ్డలు లేరు. భర్త మరణంతో ఒంటరి జీవితం గడపుతున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొడుకులా నన్ను ఆదుకున్నాడు. ప్రతి నెలా రూ.3 వేలు పింఛను సొమ్మును వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తోంది. వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 అందిస్తున్నారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.5 వేలు అందుకున్నాను. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు సైతం నాకు చేశారు. ప్రభుత్వం నాకు అండ ఉందనే ధీమాతో జీవనం సాగిస్తున్నాను.

– గండెపూడి జసింత, మండవల్లి



జగనన్న ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంది



మాది మండవల్లి గ్రామం. నాకు ఇద్దరు కుమార్తెలు. నా వయస్సు 32 సంవత్సరాలు. గత ప్రభుత్వం మాలాంటి వారికి ఎలాంటి సాయం అందివ్వలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. అమ్మ ఒడి పథకం ద్వారా నా చిన్న కుమార్తెకు ఏడాదికి రూ.15 వేలు బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. పెద్ద కుమార్తెకు జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.22 వేలు, జగనన్న వసతి దీవెన కింద రూ.8 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.5 వేలు అందాయి. మా కుటుంబం ఏ చీకూచింతా లేకుండా ముందుకు సాగుతోంది. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దాకరపు కస్తూరి, మండవల్లి

ఆర్థిక గండాల నుంచి గట్టెక్కాం



మాది అత్యంత పేద కుటుంబం. అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొనేవాళ్లం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మాకు ఎలాంటి మేలు జరగలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. నాకు వితంతు పింఛను మంజూరైంది. నా కుమార్తెకు జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. నా మనుమడు, మనుమరాలికి విద్యాదీవెన పథకం కింద ప్రతి ఏటా డబ్బులు జమచేస్తున్నారు. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఇప్పటివరకు రూ.75 వేలు లబ్ధి చేకూరింది. ఈ విధంగా జగనన్న దయతో మా కుటుంబం ఆర్థిక గండాల నుంచి గట్టెక్కింది.

– గాజులపల్లి సామ్రాజ్యం, లింగాల, ముదినేపల్లి మండలం

రోగులకు ఆర్థిక ఆసరా

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆరోగ్య భరోసా
- రోగులు కోలుకునేలా పింఛను మంజూరు
- ఏలూరు జిల్లాలో 2,346 మందికి రూ.1.57 కోట్ల చొప్పున ప్రతి నెలా పంపిణీ
- చేతులెత్తి నమస్కరిస్తున్న రోగుల కుటుంబాలు

కుక్కునూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో గత ప్రభుత్వాల హయాంలో నిర్వీర్యమైన 108, 104 సేవలను పునరుద్ధరించారు. అంతేకాక ఆరోగ్యశ్రీలో 3,257 రకాల వ్యాధులను చేర్చి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ప్రతి పేదవాడి ఇంటి ముందుకు వైద్యాన్ని తీసుకువచ్చేలా జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పేదలకు పింఛన్లు అందిస్తూ వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని అండగా నిలబడుతోంది. జగనన్న అధికారం చేపట్టిన తరువాత తలసేమియా, కిడ్నీ, సికిసెల్, అనీమియా వంటి అనారోగ్యాలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రతి నెలా వ్యాధిని బట్టి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పింఛన్ అందిస్తూ ఆదుకుంటోంది. అలా పింఛన్ పొందిన ప్రతి నిరుపేద కుటుంబం ముఖ్యమంత్రి అందిస్తున్న సాయాన్ని కొనియాడుతూ చేతులెత్తి నమస్కరిస్తోంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 2,346 మంది బాధితులకు ప్రతి నెలా రూ.1.57 కోట్లు ప్రభుత్వం పింఛన్ రూపంలో అందిస్తోంది.



ఈ ఫోటోలో కనిపిస్తున్న దంపతుల పేర్లు దాసరి శ్రీలక్ష్మి, దాసరి రమేష్. వీరికి ఇద్దరు సంతానం. మొదటి సంతానం ఆకాష్, రెండో సంతానం అనూష. రెక్కాడితే గాని డొక్కాడని దాసరి రమేష్ కుటుంబంలో ఇద్దరు చిన్నారులకు సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి సోకడంతో వారికి వైద్యం అందించేందుకు తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడేవారు. ఇదిలా ఉండగా, వీరు జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత హెల్త్ పెన్షన్‌కు దరఖాస్తు చేయగా, ఇద్దరి పిల్లలకు రూ.10 వేల చొప్పున పింఛన్ మంజూరు చేసింది. వీరిలో మూడు సంవత్సరాల క్రితం కుమారుడు ఆకాష్ మృతి చెందగా, ప్రస్తుతం కుమార్తె అనూష ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం ఎక్కించుకుంటూ పౌష్టికాహారం తీసుకుంటోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా, ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతనే తమ కుమార్తె భవిష్యత్తు బాగుపడిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

జగన్ మావయ్య ఆదుకున్నాడు



నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. నాకు, మా అన్నయ్యకు రక్త సంబంధిత వ్యాధి ఉండటంతో మేం అనారోగ్యం పాలైనప్పుడల్లా మమ్మల్ని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి మా తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. జగన్ మామయ్య ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన అందిస్తున్న పింఛన్ సొమ్ముతో ఇప్పుడు నేను ఆరోగ్యంగా ఉన్నాను. పదో తరగతి పరీక్షలు కూడా రాస్తున్నాను.

– దాసరి అనూష, కుక్కునూరు

జిల్లాలో పింఛను పొందుతున్న రోగుల వివరాలు	
బోధకాలు వ్యాధిగ్రస్తులు	25
కిడ్నీ బాధితులు	555
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి చేసుకున్న వారు	33
పక్షవాతం, ప్రమాదాలతో మంచానికే పరిమితమైన వారు	1,309
సివియర్ హెమోఫీలియా	59
శారీరకంగా కండరాల ఎదుగుదల లేని, ప్రమాదవశాత్తు అంగవైకల్యం బారిన పడిన వారు	183
సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు	109
తలసేమియా	73

న్యాయం కోరుతూ వివాహిత దీక్ష



లక్కవరంలో దీక్ష చేపట్టిన దుర్గాభవానిని సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్సై సుధీర్

జంగారెడ్డిగూడెం రూరల్: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వివాహిత మంగళవారం లక్కవరంలో దీక్ష చేపట్టింది. ఎస్సై సుధీర్‌కు బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన తనకు జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన డొక్కా రామాంజనేయులతో గత ఏడాది మే 21న వివాహం జరిగింది. వివాహమైన కొన్ని నెలలకే అత్త, మామ, ఆడపడుచు, ఆమె భర్త కానిస్టేబుల్ తనపై వేధింపులకు పాల్పడటం మొదలుపెట్టారు. భర్త నుంచి తనను వేరు చేసి వదిలించుకుందామనే ఉద్దేశంతో తరచూ వేధింపులకు గురిచేస్తూ అనేక సార్లు ఆమెను కొట్టారు. దీనిపై ద్వారకాతిరుమల, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో బాధితురాలు ఫిర్యాదు చేయగా, అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా అనేకసార్లు జరిగింది. ఈ క్రమంలో గత మూడు నెలలుగా భర్తతో తను కాపురం చేసుకుంటుండగా, మహాశివరాత్రి రోజున తన భర్తను దాచిపెట్టి తన వద్దకు రాకుండా చేస్తున్నారని ఆరోపించింది. తన భర్తను తీసుకువచ్చి అప్పగించి న్యాయం చేసే వరకు దీక్ష కొనసాగిస్తానని ఎస్సైకు తెలిపింది.



శ్రీవారి క్షేత్రంలో ఆకాశ విహంగం

శ్రీవారి కొండపై ఏర్పాటు చేసిన గరుడ పక్షి భక్తులను ఆకట్టుకుంటోంది. పలు వాహనాల విడి భాగాలతో ఆకర్షణీయంగా తయారు చేసిన ఈ గరుడ పక్షిని వరుణ్ గ్రూప్ సంస్థ దేవస్థానానికి బహూకరించింది. దీన్ని ఆలయ అధికారులు సెంట్రల్ పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. శ్రీవారికి గరుడ వాహనం ప్రీతికరమైనది కావడంతో వరుణ్ గ్రూప్ వారు దీన్ని అందజేసినట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు. – ద్వారకాతిరుమల

వివాహితపై లైంగిక వేధింపులు

ఆగిరిపల్లి: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అడవినెక్కలం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన నల్లమోతు కిషోర్ లైంగిక కోరిక తీర్చాలని వేధించాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై సురేంద్ర కుమార్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద ఔషధాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఔషధాలను చూపుతున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద ఔషధాల నియంత్రణ చట్టం ప్రకారం అభ్యంతరకర ప్రకటనలతో మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆయుర్వేద ఔషధాలను స్వాధీనం చేసుకున్నామని ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ జే బాలు చెప్పారు. ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంపీఆర్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ హరిప్రసాద్, ఇద్దరు స్వతంత్ర సాక్షులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మసీ సూపర్‌వైజర్ ఎ.హుస్సేన్, ఉపాధ్యాయుడు ఎస్.మహేష్ సమక్షంలో ఏలూరు మండలం వెంకటాపురం పంచాయితీ పరిధిలోని వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో యూనిక్ డ్రగ్స్ ల్యాబొరేటరీస్ సంస్థ ఉత్పత్తి చేసిన ఎండీ టోన్ అనే సిరప్‌ను, ఎండీ స్టోన్ అనే సిరప్ బాటిల్స్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఔషధాలను, ఏలూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు దృష్టికి బుధవారం తీసుకువెళతామని తెలిపారు.

ఘనంగా పునీత జోసెఫ్ పండుగ



దుగ్గిరాల్లో పునీత జోసెఫ్ పండుగను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న బిషప్ జయరావు

పెదవేగి: దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో పునీత జోసెఫ్ పండుగను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్, ఏలూరు పీఠాధిపతులు, విశాఖపట్నం పీఠానికి అపోస్టలిక్ అడ్మినిస్ట్రేటర్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర పాల్గొని పవిత్ర దివ్యబలి పూజను సమర్పించారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన దివ్యబలి పూజలో ఏలూరు పీఠం నుంచి పలువురు గురువులు పాల్గొన్నారు. అనంతరం బిషప్ జయరావును ఘనంగా సత్కరించారు. సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, కోశాధికారి ఫాదర్ బి రాజు, అమలోద్భవి మాత విచారణకర్తలు ఫాదర్ ఐ.మైకేల్, దంత కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్.ఫెలెక్స్, ఫాదర్ ధర్మరాజు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ.. కూలీలకు గాయాలు



ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన వ్యవసాయ కూలీలు



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో కూలీలకు చికిత్స అందిస్తున్న దృశ్యం

- పనులకు వెళ్లి తిరిగొస్తున్న కూలీల ఆటోను ఢీకొన్న ట్రక్కు ఆటో
- ఇద్దరు డ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు
- జంగారెడ్డిగూడెం జాతీయ రహదారిపై ఘటన

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆటోడ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన 12 మంది మహిళా కూలీలు జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో పొగాకు పనులకు ఆటోలో వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. జంగారెడ్డిగూడెం పరిధిలోని బైపాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఓ మహిళ ద్విచక్రవాహనంపై అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో కూలీలతో ఉన్న ఆటో డ్రైవర్ వాసారపు ముత్యం మహిళను తప్పించే క్రమంలో ఆటోను పక్కకు తిప్పాడు. అదే సమయంలో పైపుల లోడుతో ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో డ్రైవర్ ముత్యం, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు కాగా, మిలిగిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రక్కు ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108, వేరొక ఆటోలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఆటో డ్రైవర్ ముత్యంను ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కూలీలలో మర్లపూడి కళావతి, జగ్గు రమేష్‌లను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దింట్లమ్మ పెండ్లి కూతురాయెనే..



పెద్దింట్లమ్మకు పొంగళ్లు తీసుకువచ్చిన భక్తులు



కొల్లేటికోట పెద్దింట్లమ్మకు పూజలు

రేపు జలదుర్గా, గోకర్ణేశ్వరుని కల్యాణం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామివార్ల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు మంగళవారం చెప్పారు. ఉదయం జలదుర్గ అమ్మవారికి అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణతో పెండ్లి కుమార్తెను చేశారు. అనంతరం అష్టమావరణ కలశ పూజ, లలిత సహస్రపుష్పాలతో కుంకుమ పూజ, పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, సాయంత్రం పంచహారతులు అర్చకులు అందించారు. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నంకు చెందిన ముదునూరి వెంకట శ్రీనివాసరాజు దంపతులు దాతలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ హరికథా కాలక్షేపం, బైరవపట్నంకు చెందిన మీగడ సత్యానారాయణ ఘంటసాల గాన సుధ ఆకట్టుకుంది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్)/పెదవేగి: పెదవేగి మండలం వేగివాడలో ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వేగివాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తొమ్మిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల వయస్సున్న బాలికను ఇచ్చి రహస్యంగా వివాహం చేస్తున్నారనే సమాచారం మేరకు బాల్యవివాహ నిరోధక అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు, సచివాలయం మహిళా కార్యదర్శి వివాహం జరిగే ప్రదేశానికి వెళ్లి వివాహాన్ని నిలుపుదల చేశారు. బాలిక, బాలిక తల్లిదండ్రులను అధికారులు ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయానికి తరలించి డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. బాలికను సంరక్షణ నిమిత్తం వసతి గృహానికి తరలించారు. బాల్య వివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం బాల్య వివాహం చేసుకుంటే రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాలపై సమాచారాన్ని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కో–ఆర్డినేటర్ వైవీ రాజు కోరారు. పెదపాడు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ మేరీ జయమ్మ, మహిళా కార్యదర్శి కృష్ణ కుమారి, భీమడోలు సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

భీమవరం: భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. రైల్వే ఎస్సై పీటీవీ రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెన్నాడ రైల్వే యార్డ్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 40 ఏళ్ల వయస్సున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్నారు. మృతదేహంపై పసుపు రంగుపై నీలం, తెలుపు రంగు నిలువు, అడ్డచారల పొడుగు చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఎడమ తొడపై నల్లని పుట్టుమచ్చ, రెండు కాళ్లపై మోకాళ్ల నుంచి కింద వరకు బొల్లి మచ్చలు ఉన్నాయన్నారు. అలాగే మరో ఘటనలో లక్ష్మీనారాయణపురం హాల్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో సుమారు 45 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని మహిళ మృతి చెందిందన్నారు. మృతురాలు నీలం రంగుపై తెలుపు పూల డిజైన్ చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి, మెడలో ఒంటిపేట పసుపు తాడు, నీలం రంగు లంగా ధరించి ఉందన్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించామన్నారు. మృతదేహాల ఆచూకీ తెలిసిన వారు 70939 39777 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు. ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.